
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.4 । కనిష్ఠం 17.9



ఉచిత శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 21: ఉచిత శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఈడీఐఐ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సంతోష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలకేంద్రంలోని ఐకేపీ సెంటర్‌లో ఆక్సెంచర్ ఇంటర్ పీనర్షిప్ డెవలప్మెంట్ ఇన్స్టిటూయట్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యం లో మహిళలకు ఆహారం, వ్యవసాయ (ఫుడ్ ప్రాసెసింగ్)పై ఉచిత శిక్షణ తరగతులను డీసీసీ బ్యాంకు మేనేజర్ శిరీష్‌తో కలిసి ప్రారంభించారు. ట్రైనింగ్ 26 రోజులు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సీసీ రవి, దినేష్, ఈడీఐఐ మాస్టర్‌ట్రైనర్ అలేఖ్య, ఏపీఎం శ్రీవాణి, ఐకేపీసిబ్బంది ఉన్నారు.





గడ్డెన్నవాగు ప్రాజెక్టు గేట్లు

సమస్యల గడ్డెన్న గట్టెక్కేనా!?

భైంసా, ఫిబ్రవరి 21 : జిల్లాలోని భైంసా ప్రాంతంలో గల గడ్డెన్నవాగు ప్రాజెక్టు సమస్యల సుడిగుండంలో కొట్టు మిట్టాడుతోంది. ఓ వైపు ప్రభుత్వం.. మరోవైపు అధికార యంత్రాంగం పట్టింపు లేని ధోరణి కారణంగా ప్రాజెక్టు ప్రమాదకర స్థితికి చేరుకుంటోంది. నిధుల లేమితో ఆయకట్టు భూములకు రెగ్యులేటర్ గేట్ ద్వారా నీటి విడుదల, ప్రాజెక్టు వరద గేట్ల నుంచి సుద్దవాగులోకి నీటి వదిలివేత సమయాల్లో మాత్రమే దర్శనమిస్తున్న అధికారులు.. ఆ తర్వాత ఇటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. దీంతో ప్రాజెక్టు ఆలనా పాలన కరువై శిథిలావస్థకు చేరుకుంటోంది. ప్రస్తుతం ప్రాజెక్టు గ్యాలరీలోకి నీరు లీకేజీ అవుతుండటంతో స్పిల్‌వేకు ప్రమాదం పొంచి ఉంది. ఫ్లడ్ ప్రొటెక్షన్ వాల్ కోతకు గురై ప్రమాదకర స్థితికి చేరుకొని ఎనిమిది సంవత్సరాలకు పైనే అయినప్పటికీ.. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కనీసం మరమ్మతులు కూడా చేయించలేని పరిస్థితి. అలాగే ప్రాజెక్టుకు సంబంధించి విద్యుత్ స్తంభాలన్నీ బల్బులకు నోచుకోక అలంకార ప్రాయంగానే దర్శనమిస్తునాయి. ఫలితంగా ప్రాజెక్టు నిర్వహణ వ్యవస్థ అస్తవ్యస్తమై.. ప్రస్తుతం ఇద్దరు అధికారులకే పరిమితమైంది.



గడ్డెన్నవాగు ప్రాజెక్టు గ్యాలరీ నుంచి తొలగిస్తున్న నీరు (ఫైల్)

● నాటి నుంచి ప్రాజెక్టుపై నామమాత్రపు పర్యవేక్షణే..

భైంసా పట్టణంలోని సుద్దవాగుపై 14 వేల ఆయకట్టుకు సాగు నీరు అందించేందుకు గాను రూ.185 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన గడ్డెన్న వాగు ప్రాజెక్టును 2006 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టు నిర్వహణ వ్యవస్థకు సంబంధించి పూర్తిస్థాయిలో అధికారులు, సిబ్బంది నియమించపబడలేదు. ఉన్న కొద్ది మంది అధికారులు, సిబ్బంది సైతం నిర్వహణ వ్యవస్థను నామమాత్రంగా పర్యవేక్షిస్తున్నారు. దీంతో ప్రాజెక్టు ఆలనా పాలన కరువై ప్రస్తుతం ప్రమాదకర స్థితికి చేరుకుంటోంది. ప్రాజెక్టుకు సంబంధించిన గ్యాలరీలోకి అధికంగా నీరు లీకేజీ అవుతోంది. సాధారణంగా ప్రతీ ప్రాజెక్టులోని గ్యాలరీలోకి నీరు లీకేజీ అవ్వడం..

- సమస్యల సుడిగుండంలో గడ్డెన్నవాగు ప్రాజెక్టు
- ప్రాజెక్టు గ్యాలరీలోకి భారీగా లీకవుతున్న నీరు
- స్పిల్‌వేకు పొంచి ఉన్న ముప్పు
- ప్రమాదకరంగా ఫ్లడ్ ప్రొటెక్షన్ వాల్
- అలంకారప్రాయంగా విద్యుత్ వ్యవస్థ
- ఇద్దరు అధికారులకే పరిమితమైన నిర్వహణ
- కొత్త ప్రభుత్వంపైనే రైతుల గంపెడాశలు

అధికారులు ఎప్పటికప్పుడు తొలగించడం జరుగుతుంది. నీటిని తొలగించిన అనంతరం డ్యామ్ సేఫ్టీ అధికారుల సలహాలు, సూచనలు తీసుకొని వారి పర్యవేక్షణలో అవసరమైన పక్షంలో గ్యాలరీ గోడలకు సిమెంట్ ద్వారా ప్లాస్టరింగ్ పనులు నిర్వహిస్తారు. అయితే గడ్డెన్న వాగు ప్రాజెక్టుకు సంబంధించి గ్యాలరీలో నుంచి నీటి తొలగింపులు ప్రారంభించిన నాటి నుంచి సరైన రీతిలో జరగడం లేదు. నిర్వహణ లోపంతో గ్యాలరీలోకి నీటి లీకేజీలు అధికమయ్యాయి. ప్రాజెక్టు గ్యాలరీ సుమారు 107 మీటర్ల పొడవు, 30 మీటర్ల లోతుతో ఉండగా.. లోపలి భాగం 3 మీటర్ల వెడల్పుతో ఉంది. గతంలో ప్రాజెక్టు గ్యాలరీలో దాదాపు 25 మీటర్లకు మేరకు నీటి నిల్వలు పేరుకపోవడాన్ని గుర్తించిన నిర్వాహణాధికారులు.. దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. ఒక 5 హెచ్‌పీ మోటారు ద్వారా గ్యాలరీలోని నీటి తొలగింపునకు చర్యలు చేపట్టారు. ఈ ప్రక్రియ కొనసాగిన కాలంలో గ్యాలరీలో 10 మీటర్ల మేర నీటి నిల్వలు తగ్గగా.. 15 మీటర్ల మేర నీటి నిల్వలు అలానే ఉండిపోయాయి. తొలగింపులు నిలిపివేయడంతో మళ్లీ గ్యాలరీలో నీటి మట్టం 25 మీటర్ల చేరుకున్నట్లుగా తెలిసింది. ప్రస్తుతం గ్యాలరీలో 25 మీటర్ల నీటి మట్టం అలానే కొనసాగుతున్నట్లుగా సమాచారం. గ్యాలరీ నుంచి నీరు ఎంతగా తొలగింపబడుతుందే అంతే పరిమాణంలో లీకేజీ నీరు గ్యాలరీలోకి వచ్చి చేరుతోందని సమాచారం. ఇదే తీరు కొనసాగితే ప్రాజెక్టు స్పిల్‌వే ముప్పు వాటిల్లే అవకాశముందని తెలిసింది. నీటి నిల్వలు ఎక్కువ కాలం కొనసాగితే గ్యాలరీ పెచ్చులు రానున్న రోజుల్లో క్రమక్రమంగా ఊడిపోయి స్పిల్‌వే దెబ్బతినే ప్రమాదముంది.

● ఆందోళనకరంగా గడ్డెన్నవాగు ప్రాజెక్టు

నిర్వహణ వ్యవస్థ లోపభూయిష్టంగా ఉండడం వల్ల గడ్డెన్న వాగు ప్రాజెక్టు పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. నిధుల విడుదలకు నోచుకోకపోవడం మూలంగా మరమ్మతులు నిర్వహింపచేసే విషయంలో అధికార యంత్రాంగం ఏమీ చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ప్రాజెక్టు పరిస్థితి ప్రమాదకరంగా మారింది. ఎనిమిది సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షాల మూలంగా స్పిల్ వే సమీపంలోని ఫ్లడ్ ప్రొటెక్షన్ వాల్స్ కోతకు గురయ్యాయి. స్పిల్ వేకు ఎడమ వైపు 20 మీటర్ల పొడవు తో, కుడి వైపు 15 మీటర్ల పొడవుతో నిర్మించిన వాల్స్ గేట్ల నుంచి విడుదలైన నీటి ఉధృతికి తట్టుకోలేక కోతకు గురయ్యాయి. ఎడమ వైపు వాల్ చివరి అంచులు మాత్రమే మిగిలాయి. వీటితో పాటు స్పిల్‌వేకు సంబంధించిన ఎడమవైపు రేయిలింగ్ సైతం కోతకు గురైంది. సకాలంలో మరమ్మతులు నిర్వహింపచేసే విషయాన్ని అధికారులు విస్మరించడంతో.. కోత పరిమాణం పెరుగుతూ పోతోంది. రేయిలింగ్ వాల్ మట్టి కోతకు గురై సిమెంట్ గోడ కనిపిస్తోంది. గత సంవత్సరం ఆగస్టు నెలలో అధికారులు ఫ్లడ్ ప్రొటెక్షన్ వాల్‌కు అవసరమైన మరమ్మతు చర్యలు చేపట్టారు. ఇదే సమయంలో భారీ వర్షాలు కురవడం.. వరద ఉధృతి అధికంగా ఉండడంతో ప్రాజెక్టుకు సంబంధించిన ఆరు వరద గేట్లను ఎత్తి సుద్దవాగులోకి భారీ మొత్తంలో వరద నీటి వదిలి పెట్టారు. ఈ సమయంలో మరమ్మతులు నిర్వహిస్తున్న ఫ్లడ్ ప్రొటెక్షన్ వాల్ పూర్తి స్థాయిలో కొట్టుకు పోవడంతో.. సమస్య మళ్లీ మొదటికొచ్చింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పైనే ఈ ప్రాంత రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో మరమ్మతులు జరిపించి.. సమస్యల సుడిగుండంలో నుంచి గట్టెక్కించేలా చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

సమస్యను పరిష్కరిస్తాం..

● అనిల్ కుమార్
(డీఈ, గడ్డెన్నవాగు ప్రాజెక్టు, భైంసా)

గడ్డెన్నవాగు ప్రాజెక్టు గ్యాలరీలోని నీటి నిల్వల తొలగింపు చర్యలు చేపడుతున్నాం. నీటిని పూర్తిగా తొలగించి గ్యాలరీ లీకేజీల నివారణకు ప్రణాళికబద్ధమైన చర్యలు తీసుకుంటాం. గ్యాలరీలోకి నీటి లీకేజీ ద్వారా స్పిల్‌వేకు ఎలాంటి ప్రమాదం జరుగదు. ఫ్లడ్ ప్రొటెక్షన్ వాల్ మరమ్మతుల కోసం ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించాం. నిధులు మంజూరైన వెంటనే మరమ్మతులు చేపడతాం.



ఇదీ ప్రాజెక్టు వాల్ దుస్థితి



కోతకు గురైన ఫ్లడ్ ప్రొటెక్షన్ వాల్



కిందికి పడిపోయిన ప్రొటెక్షన్ వాల్ రాళ్లకట్ట



కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

కార్యకర్తలకు అండగా ఉంటాం

● మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

ముథోల్, ఫిబ్రవరి21: బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అన్ని విధాలుగా వెన్నంటి ఉంటామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముథోల్ మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన ముథోల్‌లో మాజీ వార్డు సభ్యులు బీఆర్‌ఎస్ కార్యకర్త ముక్బుల్ అహ్మద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు రూ.2లక్షల ప్రమాదబీమా సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. మృతుడి భార్యకు రూ.2 లక్షల చెక్కును మాజీ ఎమ్మెల్యే చేతుల మీదుగా బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని వెల్లడించారు. కార్యకర్తలు అధైర్యపడొద్దని ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆయేషా అఫ్రోజ్‌ఖాన్, ఎంపీటీసీ సరళ శ్రీనివాస్ గౌడ్, కోఆప్షన్ సభ్యుడు ఖలీద్, మాజీ ఎంపీపీ ఎజాజుద్దీన్, మాజీ ఎంపీటీసీ పోతన్న యాదవ్, నాయకులు షమీమ్, విశ్వంబర్, అశోక్ వాగ్మారే, రాజారెడ్డి, సమీ, సంజీవ్, బషీర్, జావీద్, అబీద్ హుస్సేన్, పాల్గొన్నారు.

ఘనంగా సంతోషిమాత మందిర వార్షికోత్సవ వేడుకలు

భైంసా, ఫిబ్రవరి 21: పట్టణంలోని సంతోషిమాత మందిర 38వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో యాగం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ చందులాల్, లయన్స్ క్లబ్ ప్రతినిధి మోహన్‌రావ్ పాటిల్ దంపతులతో పాటు పలు కాలనీల దంపతులు యాగంలో పాల్గొన్నారు. అనంతరం మందిరంలో వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భారీ అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. పట్టణవాసులతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.

ఓ వర్గం ఓట్ల కోసం..

ఆదివాసీల చరిత్ర తెరమరుగుకు కుట్ర

● వెయ్యిఉరుల మర్రి వద్ద సమాధి ఏర్పాటుకు అనుమతి ఎలా ఇస్తారు? ● ఏడాదిలోగా రాంజీగోండు స్ఫూర్తి కేంద్రం: బీజేపీ జాతీయ నాయకుడు బండి సంజయ్

నిర్మల్‌కల్చరల్, ఫిబ్రవరి21: నిర్మల్‌లోని వెయ్యిఉరుల మర్రి ప్రాంతంలో ఓ వర్గానికి చెందిన వారు సమాధిని ఏర్పాటు చేసుకోవడం పట్ల బీజేపీ జాతీయ నాయకుడు బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసీల చరిత్రను తెరమరుగు చేయడంతోపాటు ఓ వర్గానికి చెందిన ఓట్లను పొందడం కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇలాంటి కుట్రలకు తెరలేపిందని మండిపడ్డారు. బీజేపీ విజయ సంకల్ప యాత్రలో భాగంగా బుధవారం నిర్మల్‌కు చేరుకున్న బండి సంజయ్ స్థానిక ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావ్‌లతో కలిసి వెయ్యిఉరుల మర్రి ప్రాంతాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల చరిత్రను కనుమరుగు చేయాలనుకున్న బీఆర్‌ఎస్ నాయకులకు మొన్నటి ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఈ ప్రాంతాన్ని రాంజీగోండు స్ఫూర్తి కేంద్రంగా మారుస్తామన్నారు. వచ్చే ఏడాదిలోగా పనులను పూర్తిచేసి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఎంతో చారిత్రక నేపథ్యంలో ఉన్న ఈ ప్రాంతాన్ని మతం కోణంలో చూస్తుంటే కాంగ్రెస్ పార్టీ నేతలు సైతం మౌనం వహించడం శోచనీయమన్నారు. ఓట్ల కోసం వివాదా స్పదం చేయాలనుకుంటే బీఆర్‌ఎస్ మాదిరిగానే కాంగ్రెస్ చరిత్ర కూడా తెరమరుగు కాక తప్పదని ఈ సందర్భంగా ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. కాగా అంతకుముందు బండి సంజయ్ స్థానిక నేతలతో కలిసి రాంజీగోండు స్ఫూర్తి కేంద్రానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డి, పట్టణాధ్యక్షుడు సాధం అరవింద్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న సంజయ్, ఏలేటి

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

దస్తూరాబాద్, ఫిబ్రవరి 21: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక తహసీల్దార్ సర్ఫరాజ్ న వాజ్ స్పష్టంచేశారు. బుధవారం మండల కేంద్రంలోని తహీసల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఇసుకను అ క్రమంగా తరలించకుండా పంచా యతీ కార్యదర్శులు దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ యాదవరావు, ఆర్ఐ గంగన్న, ఎంపీడీవో రమేష్, ఎంపీవో అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సారంగాపూర్, ఫిబ్రవరి 21 : మండలంలోని ధని గ్రామ సమీపంలో ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి బుధవారం ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. దీంతో రెవెన్యూ అధికారులు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలించడంతో జరిమానాను విధించి వదిలి పెట్టినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అలేఖ్య కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

● మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్

ఖానాపూర్, ఫిబ్రవరి21: ఖానాపూర్‌లో దారుణంగా హత్యకు గురైన అలేఖ్య కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. బుధవారం అలేఖ్య కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా జరిగిన దారుణంపై విచారణ వ్యక్తం చేసిన రేఖానాయక్ జిల్లా కలెక్టర్‌కు, ఎస్పీకి ఫోన్ చేసి కేసు వివరాలపై ఆరా తీశారు. విచారణలో ఎటువంటి జాప్యానికి తావు లేకుండా విచారణ వేగవంతం చేయాలని అధికారులను కోరారు. అఖిల పక్షం ఆధ్వర్యంలో అలేఖ్య కుటుంబానికి న్యాయం జరగాలని పోరాటం చేస్తున్న నాయకులు నంది రామయ్య, తదితరులతో రేఖానాయక్ మాట్లాడారు. ఆమె వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పుప్పాల శంకర్, స్థానిక నాయకులు జన్నారపు శంకర్, గొర్రె గంగాధర్, ఎం. ప్రణీత్, తదితరులున్నారు.



అలేఖ్య తల్లి గంగవ్వను ఓదారుస్తున్న మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్



బండి సంజయ్‌కి స్వాగతం పలుకుతున్న ఏలేటి

తెలంగాణలో భవిష్యత్ బీజేపీదే..

● బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 21: రాష్ట్రంలో భవిష్యత్‌లో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... బీజేపీ ఎమ్మెల్యేలు ఎట్టి పరిస్థితుల్లో పార్టీని వీడే ప్రసక్తే లేదన్నారు. ఇటీవల సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్‌బాబు సీఎం రేవంత్‌రెడ్డిని కలవడం నియోజకవర్గ అభివృద్ధి కోసమేనని ఇందులో ఎటువంటి అపోహలకు తావులేదన్నారు.క్రమశిక్షణకు బీజేపీ ఎమ్మెల్యేలు మారుపేరన్నారు. ఇతర పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలే తమతో టచ్‌లో ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే నావ అని జోస్యం చెప్పారు. త్వరలోనే రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకాయమన్నారు. ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

బండి సంజయ్‌కి స్వాగతం పలికిన ఏలేటి

కొమురం భీమ్ విజయ సంకల్పయాత్రలో పాల్గొనేందుకు నిర్మల్ వచ్చిన జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ సంజయ్ కుమార్‌కు బుధవారం బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఆయనను శాలువాతో సన్మానించారు. ఎంపీ సోయం బాపురావు, తదితర నేతలు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

సంత్ సేవాలాల్ 285 జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిర్మల్‌లో జరిగిన సభలో బీజేఎల్పీ నాయకుడు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఆయనతో పాటు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎమ్మెల్యే రామారావు పటేల్, వెడ్మ బొజ్జు, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, తదితర నాయకులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ ఎందుకు చేయట్లేదు!? : ఎమ్మెల్యే

సిరికొండ,ఫిబ్రవరి21:సిరికొండ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ లబ్ధిదా రులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పేదల ప్రజల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా తల పెట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు నిరుపేదలకు ఓవరం లాంటివని కొనియా డారు. గత ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ ఎందుకు చేయట్లేదు అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి రైతుల పై ప్రేమ ఉంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణమాఫీ, రైతుబంధు నిధులను తక్షణమే విడుదల చేయాలని అన్నారు. అదేవిధంగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులతో పాటు తులం బంగారం పంపిణీ ఏమైందని అన్నారు. అనంతరం మండల కేంద్రంలో పలు వీధుల్లో తిరుగుతుప్రజల కష్ట సుఖాలను అడిగి తెలుసు కున్నారు. అలాగే స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు.కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, ఏపీఓ శేషారావు, ఆర్‌ఐ విలాస్, మాజీ సర్పంచ్ ఓరుగంటి పెంటన్న, ఎంపీటీసీ పర్వీన్‌లతీఫ్, బీఆర్ఎస్ నాయకులు ఎక్బాల్,తోకల చందు, నర్సింలు, విద్యా కమిటీ చైర్మన్ జింక లక్ష్మణ్, సోన్‌పెల్లి మాజీ సర్పంచ్ కదం సూర్యకాంత్, షేక్ రంజాన్, పాల్గొన్నారు.


కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

కోలాం గిరిజనులకు సర్టిఫికెట్ల పంపిణీ

తలమడుగు, ఫిబ్రవరి21:మండలంలోని 11గ్రామాల్లో గల కోలాం గిరిజనులకు కుల ధ్రువీకరణ పత్రాలను అందించడం జరిగిందని తహసీల్దార్ రాజామోహన్ తెలపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదిమ జాతి కులం గిరిజనుల అభివృద్ధి కోసం పీటీజీ కింద అందిస్తున్న ఆర్థిక రుణాల కోసం అర్హులైన కోలం గిరిజనులందరికీ త్వరగా సర్టిఫికేట్లను అందించడం జరిగిందన్నారు. లబ్ధిదారులు ఎవరు మధ్యదళారులను ఎవరు నమ్మవద్దన్నారు.నేరుగా కార్యాల యం కొచ్చి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు దాదాపు 150 మందికి సర్టిఫికెట్లు అందిం చడం జరిగిందన్నారు. ఇందులో డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


కుల ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న తహసీల్దార్

మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడికి సన్మానం

నేరడిగొండ, ఫిబ్రవరి21: బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఆడే వసంత్‌రావ్ ను స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. బోథ్ ఏఎంసీ పాలక వర్గం రద్దు కాగా నూత నంగా ఏర్పాటు చేసిన పాలక వర్గంలో నేరడి గొండ పీఏసీఎస్ డైరెక్టర్ ఆడే వసంత్‌రావుకు బోథ్ ఏఎంసీ ఉపాధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీ నియమించడంతో ఆయనను మండల కేం ద్రంలో శాలువా పూలమాలలతో సన్మానించారు. తనపై నమ్మకం ఉంచి ఉపాధ్యక్ష పదవి అప్ప గించిన ఇన్‌చార్జీ ఆడే గజేందర్, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావులకు ప్రత్యేక అభి నందనలు తెలిపారు.



వనదేవతల రాకతో..

బుధవారం రాత్రి సారలమ్మ రాకతో వనం పులకించిపోయింది. రాత్రి కన్నెపల్లి నుంచి సారలమ్మను ప్రధాన పూజారి కాక సారయ్య జయజయధ్వానాల మధ్య తీసుకొచ్చారు. అలాగే పూనుగొండ్ల నుంచి మంగళవారం బయలుదేరిన పగిడిద్దరాజు బుధవారం మేడారానికి చేరుకున్నారు. కొండాయి నుంచి గోవిందరాజులు, నాగులమ్మ గద్దెలకు చేరుకోవడంతో భక్తుల మొక్కులు ప్రారంభమయ్యాయి.

- లక్షలాదిగా తరలివచ్చిన భక్త జనం
- కిటకిటలాడుతున్న జాతర ప్రాంగణం
- సారలమ్మ రాకతో మొదలైన మహాజాతర
- ప్రశాంతంగా ముగిసిన తొలి ఘట్టం

మేడారం.. జన సంద్రం..



జంపన్నవాగు నుంచి గద్దెల వద్దకు వచ్చే దారిపై భక్తజనం రద్దీ



మేడారంబృందం, ఫిబ్రవరి21: జనం.. జనం ప్రభంజనం. ఎటు చూసినా భక్త జన సంద్రం. అన్ని దారులు మేడారం వైపే.. పలు మార్గాల గుండా లక్షలాది భక్తులు మేడారానికి పోటెత్తుతున్నారు. దీంతో బుధవారం రాత్రి వరకు మేడారం పరిసరాలు జనజాతరయ్యాయి. భక్తుల తాత్కాలిక గుడారాలు, చిరువ్యాపారుల అంగళ్లతో సందడిగా మారింది. జాతరకు ఇప్పటికే కోటిమంది వరకు భక్తులు వచ్చినట్టు ప్రాథమిక అంచనా కాగా గురువారం సాయంత్రానికి మరో 50లక్షల మంది వరకు రావొచ్చునని భావిస్తున్నారు. నెలరోజులుగా మేడారానికి వస్తూ ముందస్తు మొక్కులు చెల్లించుకున్న భక్తులు కాక వీరు అదనమని అధికారులు చెబుతున్నారు. ఇక జాతరలో తొలిఘట్టమైన సారలమ్మ రాక.. బుధవారం సాయంత్రం జరగ్గా.. సాయంత్రానికి ఒక్కసారిగా భక్తుల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. మేడారంలోకి ప్రవేశించే అన్ని మార్గాల వద్ద మోహరించి.. వాహనాలను నియంత్రిస్తున్నారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, డీసీఎంలు, లారీలు, కార్లు, ఆటోలు తదితర వాహనాల్లో వస్తుండగా.. డ్యూటీ, ప్రత్యేక పాస్‌లున్న కొన్ని వాహనాలను మాత్రమే మేడారంలోకి అనుమతిస్తున్నారు. దీంతో ప్రైవేటు వాహనాల్లో వచ్చే వారంతా మేడారానికి 5 కిలో మీటర్ల దూరంలోని పార్కింగ్ ప్రాంతాల నుంచి మూటాముల్లెలతో కాలినడకన గద్దెలకు చేరుకుంటున్నారు.

దూరప్రాంతాల నుంచి..

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. జాతర సమయంలోనే సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవాలని తపించే లక్షల మంది మంగళవారం నుంచి మేడారం బాట పట్టారు. వాహనాలు, బస్సులు, ఎడ్ల బండ్లలో తరలివచ్చి మేడారం చుట్టుపక్కల విడిది చేశారు. దీంతో మేడారానికి ఎటుచూసినా 20 కి.మీ. వరకు భక్తుల సందోహమే కనిపిస్తోంది. వనం అంతా జనమైంది.

సేవాలాల్ జీవితం స్ఫూర్తిదాయకం

- జయంతి సభలో నిర్మల్ కలెక్టర్
- పాల్గొన్న ఎమ్మెల్యేలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు



సభకు హాజరైన ప్రజలు

నిర్మల్‌కల్చరల్, ఫిబ్రవరి21: సంత్ సేవాలాల్ జీవితం ప్రతీఒక్కరికి స్ఫూర్తిదాయకమని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పిలుపునిచ్చారు. బుధవారం జగదాంబ ఆలయ ప్రాంగణంలో సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, రామారావు పటేల్, వెడ్మ బొజ్జు ముఖ్యఅతిథులుగా హాజరై సేవాలాల్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ సేవాలాల్ జయంతి ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. సామాజిక దురాచారాలను నిర్మూలించడంతో పాటు ప్రజల కోసం ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు. బంజారా కుటుంబాల్లో వెలుగులు నింపిన మహనీయుడు చిరస్మరణీయుడన్నారు. ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ బంజారాల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గిరిజన తండాలలో 100 కోట్ల నిధులతో రహదారుల నిర్మాణ పనులు చేపట్టినట్లు స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలో ఆడిటోరియం, బంజారా భవన్, గురుకుల పాఠశాలల భవన నిర్మాణాలకు కృషి చేయనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ... బంజారా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పోడు భూముల పట్టాలు, ఆర్‌వోఎఫ్‌ఆర్ సమస్యలపై దృష్టి సారిస్తానన్నారు. ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ ప్రజలు సేవాలాల్ చూపిన సన్మార్గంలో నడవాలని కోరారు. వారి సంస్కృతి సాంప్రదాయాలు గౌరవించాలన్నారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్న కళ్యాణి, డీఆర్డీవో విజయలక్ష్మి, డీటీడీవో అంబాజీ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తుకారాం, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలపై అపోహలు వద్దు

- ట్రాన్స్‌కో ఎస్ఈ జైవంత్ చౌహాన్



సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ట్రాన్స్‌కో ఎస్ఈ

భైంసా, ఫిబ్రవరి21: వినియోగదారులెవరు వేసవిలో విద్యుత్ కోతలపై అపోహలు పెట్టుకోవద్దని ట్రాన్స్‌కో ఎస్ఈ జైవంత్ చౌహాన్ వెల్లడించారు. బుధవారం భైంసాలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అంతరాయం లేని విద్యుత్ సరఫరా కొనసాగించేందుకు గాను ప్రణాళికబద్ధమైన చర్యలు చేపట్టినట్లుగా వివరించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ వేసవిలో విద్యుత్ కోతలు ఉండబోవన్నారు. 24 గంటల పాటు విద్యుత్ సరఫరా అందిస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని విద్యుత్ సబ్ స్టేషన్లకు అవసరమైన మరమ్మత్తులు నిర్వహిస్తూ నిర్వాహణ వ్యవస్థను మెరుగుపరుస్తున్నామని వెల్లడించారు.

● విద్యుత్ సమస్యలను సకాలంలో పరిష్కరించాలి

సబ్‌స్టేషన్ల అధికారులు విద్యుత్ సమస్యలను త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని ట్రాన్స్‌కో ఎస్ఈ జైవంత్‌చౌహాన్ సూచించారు. బుధవారం భైంసాలో డీఈ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని విద్యుత్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

● భైంసా రూరల్ ఏఈ రాంబాబు పై బదిలీ వేటు

మండల పరిధిలోని కథ్‌గాం గ్రామస్తులతో దురుసుగా వ్యవహరించిన ట్రాన్స్‌కో భైంసా రూరల్ ఏఈ రాంబాబు పై అధికారులు బదిలీ వేటు వేసారు. మంగళవారం విద్యుత్ సరఫరాలోని అంతరాయంపై కథ్‌గాం గ్రామస్థులు భైంసాలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో ఏఈ రాంబాబు వ్యవహరించిన తీరుపై మాజీ సర్పంచ్ రాజు ట్రాన్స్‌కోఅధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఉన్నతాధికారులు ఏఈ రాంబాబును నిర్మల్ ట్రాన్స్‌కో విజిలెన్స్ విభాగానికి బదిలీ చేశారు. ఆయనస్థానంలో సబ్‌ఇంజనీర్ శ్రీనివాస్‌కు బాధ్యతలిచ్చారు.



జాతరలో పోతరాజుల విన్యాసాలు

ప్రారంభమైన సమ్మక్క సారలమ్మ జాతర

- గద్దెపైకి వచ్చిన సారలమ్మ బోనాలు, ఒడి బియ్యం సమర్పణ
- మొక్కులు తీర్చుకున్న భక్తులు

ముథోల్, ఫిబ్రవరి21: నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ తండాలో గల గుట్టలో వెలిసిన సమ్మక్క-సారలమ్మ జాతర బుధవారం ప్రారంభమైంది. దేవాలయ పూజారి జాదవ్ వేణుకమ్మ, ఆలయ ధర్మకర్త జాదవ్ సతీష్‌లు బాజభజంత్రీల మధ్య పోతరాజుల విన్యాసాలతో కనక వనానికి తీసుకువచ్చారు. మొదటిరోజు సారలమ్మ గద్దెపైకి వచ్చింది. బోనాలు, ఒడి బియ్యం తీసుకువచ్చి శ్రీ సారలమ్మకు సమర్పించారు. కోరిన కోర్కెలు నెరవేరాలని వన దేవతలకు భక్తులు మొక్కులు చెల్లించారు. మొదటి రోజు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండే కాకుండా నిజామాబాద్, మహారాష్ట్ర నుండి సైతం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వన దేవతలకు భక్తి శ్రద్ధలతో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మొక్కిన మొక్కులు నెరవేరాలని నిలువెత్తు బంగారాన్ని (బెల్లం) సమర్పించారు. మరికొందరు మేకలను బలిచ్చారు. ఈ జాతర నాలుగు రోజులపాటు అంగరంగ వైభవంగా జరుగుతుంది.

ఉపాధిహామీ పనుల పరిశీలన

నేరడిగొండ, ఫిబ్రవరి 21: ఉపాధిహామీ పనులను డీఆర్డీఓ సాయన్న బుధవారం మండలంలోని బుగ్గారాం నేరడిగొండ గ్రామాలలో చేపడుతున్న పనులను పరిశీలించారు. పనుల, కూలీల హాజరు శాతాన్ని పరిశీలించారు. పనికి తగ్గకూలీ అందేలా చూడాలని ప్రతి ఒక్కరికి పనులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ రాజ్‌వీర్, ఏపీవో వసంత్‌రావ్, టీఏలు, కార్యదర్శులు, ఎఫ్ఏలు ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు కుంటాల రాములు

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 21: మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు కుంటాల రాములు డిమాండ్ చేశారు. బుధవారం ఆదిలాబాద్ మున్సిపల్ వాటర్ ట్యాంక్ వద్ద కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కాంతారావు, అధ్యక్షుడిగా చిరంజీవి, కార్యదర్శిగా రాజలింగుతో పాటు తదితరులను ఎన్నుకున్నారు.

బీఆర్ఎస్‌తో మాకేం పొత్తు!



మాట్లాడుతున్న బండి సంజయ్

● మా నోటికాడి బుక్కను కాంగ్రెస్ లాక్కుంది ● ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చింది

● అయోధ్యలో బాబ్రీ మసీదు కట్టాలనే వాళ్లను బొందపెడతాం

● రాముడి పుట్టుకను ప్రశ్నించే పార్టీలకు భవిష్యత్ ఉండదు

● 17 ఎంపీ సీట్లను గెలిపిస్తే కొట్లాడి కేంద్రం నుంచి నిధులను తీసుకొస్తాం

● జిల్లాలో విజయ సంకల్ప యాత్రలో బండి సంజయ్

ఆదిలాబాద్, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి)/ఇచ్చోడ/నేరడిగొండ: 'కేసీఆర్ అనే మూర్ఖుడు తెలంగాణను నాశనం చేశాడు. కేంద్రం ఇచ్చిన నిధులను దారి మళ్లించాడు. తెలంగాణ అభివృద్ధిలో ప్రతీ పైసా కేంద్రానిదే. బీఆర్ఎస్ ఇక నాశనమై పోయింది. పొత్తు పొత్తు అంటూ ఢిల్లీకి పోతున్నారటా. జాతీయ పార్టీ అన్న కేసీఆర్ ఎక్కడికి పోయిండు... గా బీఆర్ఎస్ వాళ్లతో మాకేం పొత్తు.. ఫారెన్ నుంచి వచ్చిన స్కాచ్ బాటిల్‌ను టెస్టు చూడడానికే కేసీఆర్ ఢిల్లీ పోయిండు' అంటూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యద ర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కేసీఆర్‌పై ఫైర్ అయ్యారు. బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్రలో భాగంగా బుధవారం ఆయన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని నేరడిగొండ, ఇచ్చోడ సభల్లో మాట్లాడారు. తెలంగాణ ప్రజల పక్షాన కొట్లాడి జైలుకు పోతే అధి కారంలోకి రావాల్సింది పోయి.. ఆరు గ్యారెంటీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మానోటి కాడి ముద్దను లాక్కుందన్నారు. అందుకు ప్రధానకారణం హిందువులంతా ఓటు బ్యాంకుగా మారకపోవడమేనన్నారు. అయోధ్యలో బాబ్రీ మసీదు ఉండాలని అంటే బొందపెడతామని, అలాంటి వాళ్లను బట్టలు ఊడ దీసి కొడతామన్నారు. అయోధ్యలో రాముడి పుట్టుకను ప్రశ్నిస్తున్న రాజకీయ పార్టీలకు అసలు భవిష్యత్తే లేకుండా చేస్తామన్నారు. రాముడు అక్కడే పుట్టాడన్న గ్యారెంటీ ఏమిటని అడిగే వాడికి మీ అమ్మకు పుట్టావన్న గ్యారెంటీ ఏమిటని అడగాలన్నారు. అయోధ్యలో రామ మందిరం కోసం పోరాడిన కరసేవకులను కాల్చిచంపిన మాజీ సీఎం ములాయం సింగ్ యాదవ్ బతుకు ఏమైం దో ఆలోచించాలన్నారు. రాంజీగోండు సేవను కనుమరుగు చేసేందుకు వెయ్యి ఊడలమర్రి వద్ద సమాధిని ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ చరిత్రను ప్రజలు కనుమరుగు చేశారన్నారు. కాంగ్రెస్ స్పందించి దిద్దుబాటు చర్యలను చేపట్టాలని, లేకపోతే బీఆర్ఎస్‌కు పట్టిన గతే వాళ్లకు పడుతుందన్నారు. వెయ్యిఊరుల మర్రి వద్దె రాంజీగోండు స్మృతివనాన్ని నిర్మించితీరుతామని, అడ్డుకునే వారి అంతు చూస్తామన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఛత్రపతి శివాజీ జయంతిని అధికారికంగా నిర్వహిస్తామని చెబితే భయపడి తెలంగాణ వ్యాప్తంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. తెలంగాణలో రావాల్సింది రామరాజ్యమని, కానీ రజాకారుల రాజ్యం వచ్చిందన్నారు. ఈ దేశ రక్షకుడు, ఒకే ఒక నాయకు డు మోదీ అని అన్నారు. ప్రజల కోసం కొట్లాడితే తనను రెండు సార్లు జైలుకు పంపారన్నారు. రైతులు, నిరుద్యోగులు, పోడు భూములు, మహిళలపై ఆత్యాచారాలు జరిగితే బీజేపీ కొట్లాడిందని, మరి కాంగ్రెస్ ఏం చేసిందో ప్రశ్నించాలన్నారు.



భారీగా వచ్చిన జనం



మాట్లాడుతున్న సోయం

● కాంగ్రెస్ ఎలా అధికారంలోకి వచ్చింది..

'కాంగ్రెస్ ప్రజలపక్షాన కొట్లాడనే లేదు. ఎట్ల అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ స్కీముల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చింది. వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని ప్రకటించి.. నేటికీ 80రోజులు గడిచిన అతీగతి లేదు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ, రైతుబంధు కింద రూ.15వేలు, మహిళలకు రూ.2500లు, ఇంటి స్థలం వంటి హామీలన్నీ ఎటు పోయాయో కాంగ్రెస్ చెప్పాలి' అని బండి సంజయ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హామీలపై నిలదీయాలని ప్రజలను కోరారు. మరో 15 రోజుల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఆ తర్వాత కోడ్‌ను సాకుగా చూపి కాంగ్రెస్ తప్పించుకునే ప్రయత్నం చేస్తుందని అన్నారు. కొట్లాడి నిధులు తీసుకొస్తామన్నారు. తెలంగాణలో బీజేపీకి 17 ఎంపీ సీట్లను గెలిపిస్తే కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వంతో కొట్లాడి నిధులు తీసుకొస్తామని తెలిపారు. రాష్ట్రానికి అత్యధిక నిధులు తీసుకొచ్చే అవకాశం ఉంటుందని, అందువల్ల వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరు బీజేపీకి ఓటు వేసి మోదీని మరోసారి ప్రధానమంత్రిగా చూడాలన్నారు.

● మీరంతా తోపులే..

'ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్న. ఔరంగజేబులంతా ఒక్కటై బీజేపీ పార్టీ అభ్యర్థులను ఓడించేందుకు సిద్ధమైనా.. వారిని ఎదురించి ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏకంగా నలుగురు ఎమ్మెల్యేలను గెలిపించడం మామూలు విషయం కాదు. మీరంతా తోపులే.' అని బండి సంజయ్ అన్నారు. ఈ దేశంలో మోదీ రాజ్యం కావాలో.. రాహుల్ రాజ్యం కావాలో అని ప్రజలు ఆలోచించాలని కోరారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

అసెంబ్లీ దృష్టికి గిరిజనేతరుల సమస్య

● ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఉట్నూర్, ఫిబ్రవరి21: శాసనసభ సమావేశాల్లో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏజెన్సీ ప్రాంతాలకు గిరిజనేతరుల సమస్యను అసెంబ్లీ దృష్టికి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే వెడ్మబొజ్జు ప్రకటించారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని తన స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుని గిరిజనేతరులకు పహానీలు, బ్యాంకులు అదేవిధంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకు వెళ్లానన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని సదర్‌మట్ ప్రాజెక్టు, కడెం ప్రాజెక్టుతో పాటు ఖానాపూర్‌లో డిగ్రీ కాలేజి, రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం అసెంబ్లీ దృష్టికి తీసుకు వెళ్లనున్నారు. ఖానాపూర్ నియోజక వర్గంలో విద్య వైద్యం వ్యవసాయ రంగాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సైతం ఖానాపూర్ సమస్యలు వివరించారని ఆయన కూడా స్పందించారన్నారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తున్నానని, ఇంద్రవెల్లి అమరవీరులకు కుటుంబాలకు చేయూత ఇచ్చినట్టు తెలిపారు.

కాగా రాష్ట్ర మంత్రి సీతక్కపై నమస్తే తెలంగాణ దినపత్రిక అసత్య ఆరోపణలు గుప్పిస్తోందని.. ఆ పత్రికను గ్రామాల్లోకి రానివ్వకుండా అడ్డుకోవడం పాటు దగ్ధం చేస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జుపటేల్ హెచ్చరించారు. ఇసుక మాఫియాను కట్టడి చేయడం.. 40 లారీలను సీజ్ చేయించడంతో మం త్రి సీతక్క మీద, మంత్రి పీఏ సుజిత్‌రెడ్డి పై ఆరోపణలు చేస్తున్నారని న్నారు. ఈఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సీతక్కకు పెరుగుతున్న ఆదరణను చూసి ప్రతిపక్ష నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. నమస్తే తెలంగాణ పత్రిక తప్పుడు వార్తలు రాస్తూ మంత్రిని ఇబ్బందుల కు గురిచేస్తోందని, ఆ పత్రికపై పరువు నష్టం దావా వేయడం జరుగుతుందని ఎమ్మెల్యే వెడమ బొజ్జుపటేల్ హెచ్చరించారు.

జాబ్‌కార్డు ఉన్న అందరూ ఉపాధి పనుల్లో పాల్గొనాలి



పని ప్రదేశంలో కూలీలతో మాట్లాడుతన్న ఏపీవో శ్రీనివాస్

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 21: జాబ్ కార్డు ఉన్న వారందరూ ఈజీఎస్ పనుల్లో పాల్గొని ఉపాధి పొందాలని ఏపీవో శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని దిగ్నూర్ గ్రామంలో నిర్వహిస్తున్న ఈజీఎస్ పనులను పరిశీలించారు. ముందుగా మాస్టర్లను పరిశీలించి హాజరు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ వేసవికాలంలో 100 రోజులు ప్రభుత్వం కల్పించే ఉపాధి పనులను సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని అన్నారు. పనులకు సంబంధించిన కచ్చితమైన కొలతల ప్రకారం కేటాయించిన పనులను పూర్తి చేసి అధిక మొత్తంలో వేతనం పొందాలని అన్నారు. పనులకు సంబంధించి ఏమైనా అవకతవకలకు పాల్పడితే తన దృష్టికి తేవాలని అన్నారు. పని కోరే వారు ముందుగా ఫీల్డ్ అసిస్టెంట్‌కు సమాచారం అందించాలని, మరుసటి వారం పని కల్పించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సీతారాం, కూలీలు ఉన్నారు.



కుంటాల జలపాతం వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

హరిత హోటల్ నిర్మాణం కోసం స్థలాన్ని తొందరగా అప్పగించాలి

● ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా

నేరడిగొండ, ఫిబ్రవరి21: కుంటాల జలపాతం వద్ద నిర్మించ తలపెట్టిన హరిత (రిసార్ట్) హోటల్ కోసం స్థలాన్ని తొందరగా గుర్తించి సంబంధితశాఖకు అప్పగించాలని తహసీల్దార్, సంతోష్‌రెడ్డిలను ఆదేశించారు. హరిత హోటల్ నిర్మించడంతో స్థానికులకు ఉపాధి దొరకడంతోపాటు పర్యాటకులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. శివరాత్రి పర్వదినాన పర్యాటకులు తాకిడి ఎక్కువ ఉంటుందని, అటవీశాఖ అధికారులు ఏర్పాట్లను చేపట్టాలన్నారు. ఆమెవెంట డీఎఫ్‌వో ప్రశాంత్ పాటిల్, ఐటీడీఏ ఈఈ రాథోడ్‌భీంరావ్, ఎంఆర్‌ఐ నాగోరావ్, ఎఫ్ఆర్‌ఓ గణేష్, తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం

బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గంగారెడ్డి బాధ్యతల స్వీకరణ

బోథ్, ఫిబ్రవరి 21: బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బొడ్డు గంగారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మార్కెట్‌కమిటీ కార్యదర్శి మనోహర్ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ ఆడే వసంతరావుతోపాటు పాలకవర్గ సభ్యులు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడేగజేందర్ అధికార ప్రతినిధి ప్రతినిధి పశుల చంటి, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరి ప్రపోల్ చందర్‌రెడ్డి, ఎంపీటీసీ మహేందర్ తదితరులు ఉన్నారు.

రేషన్‌డీలర్ల సమస్యలను పరిష్కరించాలి

ఆదిలాబాద్‌అర్బన్, ఫిబ్రవరి21: రేషన్‌డీలర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేపట్టారు. నాణ్యతలేని బియ్యాన్ని సరఫరా చేస్తున్నారని, రీసైక్లింగ్ చేసి చిరిగిన బస్తాల్లో బియ్యాన్ని రేషన్ దుకాణానికి పంపిచండంతో తాము నష్టపోతున్నామని సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ తెలిపారు. భారత్ బ్రాండ్ పేరుతో ప్రవేశపెట్టిన బియ్యాన్ని రేషన్ దుకాణం ద్వారా సరఫరా చేయాలని కోరారు.

డీఈవో కార్యాలయం ఎదుట యూటీఎఫ్ నిరసన

ఆదిలాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 21: ఇటీవల ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహించిన సమావేశంలో తమను ఆహ్వానించకపోవడాన్ని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు ఆదిలాబాద్ డీఈవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. సమావేశానికి తమను ఎందుకు ఆహ్వానించలేదని డీఈవోను నిలదీశారు. ఏఎస్ఓవో నియామకంలో ఏకపక్షంగా వ్యవహరించారని దుయ్యబట్టారు. దీనిపై తమ సంఘానికి క్షమాపణ చెప్పాలని రాష్ట్ర కార్యదర్శి వెంకట్ డిమాండ్ చేశారు. ఇకపై ఇలాంటి పొరపాట్లు డీఈవో జరగవని చెప్పడంతో నాయకులు ఆందోళన విరమించారు.

డీఎస్పీని కలిసిన సీపీఐ నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 21: ఆదిలాబాద్ డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన జీవన్‌రెడ్డిని జిల్లా సీపీఐ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సీపీఐ కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి నేతృత్వంలో నాయకులు డీఎస్పీని కలిశారు. ఈసందర్భంగా గతంలో వన్‌టౌన్ ఎస్సైగా పని చేసిన తరుణంలో జీవన్‌రెడ్డితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పార్టీ నాయకులు నళినిరెడ్డి, అరుణ్‌కుమార్, రాములు పాల్గొన్నారు.

పశు వైద్య కేంద్రం పరిశీలన

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి21: మండలకేంద్రంలోని పశువైద్య కేంద్రాన్ని జిల్లా అధికారి డా.కిషన్ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. మండలవాసులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని అన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి పర్వేజ్ అహ్మద్, గోపాల మిత్ర మారుతి ఉన్నారు.

జంతువులతో నష్టపోయిన అందరికీ పరిహారం



బాధిత రైతులకు పరిహారం అందజేస్తున్న ఎమ్మెల్యే

● సంత్ సేవాలాల్ మహారాజ్ చూపించిన మార్గంలో నడవాలి: ఎమ్మెల్యే జాదవ్ అనిల్



కజ్జర్లలో సమ్మక్క, సారక్క, గద్దెలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

బోథ్, ఫిబ్రవరి21: జంతువుల మూలంగా పంటలు, పశువులు నష్టపోయిన బాధితులందరికీ ప్రభుత్వపరంగా నష్టపరిహారం అందిస్తామని బోథ్ ఎమ్మెల్యే జాదవ్‌అనిల్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పిప్పల్‌ధరి గ్రామానికి చెందిన పూయిక దేవరావు పశువులను చిరుతపులి చంపివేయడంతో వారికి నష్టపరిహారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువుల వల్ల పంటలు, పశువులు నష్టపోయిన రైతులు సంబంధిత అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. బాధితులకు పరిహారం విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేయవద్దని ఎమ్మెల్యే ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో రేంజ్ అధికారి సుందర్, బీట్ ఆఫీసర్ నాగోరావులు ఉన్నారు.

సేవాలాల్ మహరాజ్ చూపిన మార్గంలో నడవాలి..

సంత్ సేవాలాల్ మహరాజ్ చూపిన మార్గంలోనే బంజారాలు నడుచుకోవాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పేర్కొన్నారు. బుధవారం సోనాల మండల కేంద్రంలో సంత్ సేవాలాల్ 285వ జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మొదట సంత సేవాలాల్ చిత్ర పటానికి ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. సేవాలాల్ బంజారాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్‌తోపాటు నియోజకవర్గం పరిధిలోని పలు గ్రామాల నాయకులు, బంజారాలు పాల్గొన్నారు.

సమ్మక్క, సారక్క స్ఫూర్తితో నియోజకవర్గ అభివృద్ధి..

తలమడుగు: సమ్మక్క, సారక్క స్ఫూర్తితో బోథ్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పరుస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని కజ్జర్ల గ్రామంలో ఉన్న సమ్మక్క-సారక్క విగ్రహాల వద్ద ఏర్పాటుచేసిన జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. ఇటీవల నియోజకవర్గంలో రూ.6కోట్లతో అభివృద్ధి పనుల నిర్మాణానికి భూమిపూజ చేసినట్లు చెప్పారు. ఆయనవెంట పాటు బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు ఉన్నారు.

పారిశుధ్యం పై నిర్లక్ష్యం వహించవద్దు: ఎంపీడీవో

తలమడుగు, ఫిబ్రవరి 21: పారిశుధ్యంపై ఎవరూ నిర్లక్ష్యం వహించవద్దని ఎంపీడీవో శేఖర్ కోరారు. బుధవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శేఖర్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం లోపించడం వల్ల పలు అంటువ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ఎవరూ రోడ్లపై మురికినీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అదే విధంగా మండలంలోని ప్రతీ గ్రామ పంచాయతీలో మురికి కాలువను ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలని సూచించారు. గ్రామాల్లో ప్రతీ ఒక్కరు ఇంటి వద్ద మరుగుదొడ్డి నిర్మించుకోవాలని, లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందిస్తామని అన్నారు. జాబ్‌కార్డు ఉన్న అందరికీ ఉపాధి పనులు కల్పిస్తామన్నారు. అనంతరం కొత్తూరు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. ఈయన వెంట పంచాయతీ సెక్రటరీ రాహుల్, గ్రామస్థులు పాల్గొన్నారు.



వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న ఎంపీడీవో

మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యం



పనులను ప్రారంభించిన జడ్పీటీసీ

● జైనథ్ మండల జడ్పీటీసీ తుమ్మల అరుంధతి రెడ్డి

జైనథ్, ఫిబ్రవరి 21: మండలంలోని 42 గ్రామ పంచాయతీ పరిధిలోని ఆయా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని జైనథ్ మండల జడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని లేఖర్‌వాడ గ్రామంలో జాతీయ ఉపాధిహామీ పథకం కింద రూ.4లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కొబ్బరికాయలు కొట్టి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ ప్రజల ఆశలు ఆశయాలకు అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన సాగుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గిమ్మా సంతోష్, మాజీ ఎంపీపీ తల్లెల చంద్రయ్య, మాజీ సర్పంచ్ ఉష్కందౌలత్, నాయకులు ఉష్కంయాదవ్, చందరమాకాంత్, షేక్‌బాబా, షేక్‌హుసేన్, చిందం మోహన్, ఆకుల రామరావ్, షేక్‌చాంద్‌పాజ్, జక్కుల దేవన్నలతో పాటు లేఖర్‌వాడ గ్రామ ప్రజలు నాయకులు, అధికారులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న మాజీ ఎంపీ రాథోడ్ రమేష్

బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించిన మాజీ ఎంపీ

ఉట్నూర్, ఫిబ్రవరి21: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న సంకల్ప యాత్ర బహిరంగ సభ ఏర్పాట్లను మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ బుధవారం పరిశీలించారు. ఉట్నూర్ మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం మధ్యాహ్నం 12 గంటలకు సంకల్ప యాత్ర సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని నాయకులకు కోరినట్లు తెలిపారు. భైంసా నుంచి ప్రారంభమైన బస్సుయాత్ర ఇంద్రవెల్లి మీదుగా ఉట్నూర్ చేరుకుంటుందన్నారు. ఆయన వెంట జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్ నాయకులు శ్రీపతిలింగగౌడ్, సాడగేరాజేశ్వర్, సిలువేరు లింగన్న, కాల్వరవి పాల్గొన్నారు.

విజయసంకల్ప యాత్రకు తరలిన బీజేపీ కార్యకర్తలు

బోథ్ ఫిబ్రవరి 21: నేరడిగొండ మండల కేంద్రం మీదుగా కొనసాగిన విజయ సంకల్ప యాత్రకు బీజేపీ కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. సంకల్ప యాత్రపై ప్రచారం కొరవడిన కార్యకర్తలు మాత్రం భారీ సంఖ్యలో పార్టీపై ఉన్న అభిమానంతో తరలివెళ్లడం జరిగిందని, అన్ని గ్రామాల నుంచి యువకులు తరలివెళ్లారు.

కాలు జారిపడి కాల్వలో పడి వృద్ధురాలి మృతి

జైనథ్, ఫిబ్రవరి 21: మండలంలోని మేడిగూడ (ఆర్) గ్రామానికి చెందిన బోడకుంట సుశీల (90) ప్రమాదవశాత్తు కాలు జారి సాత్నాల కుడి కాల్వ (కెనాల్)లో పడి మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుశీల భర్త విఠల్ చనిపోయినప్పటి నుంచి మతిస్థిమితం కోల్పోయింది. బుధవారం మేడిగూడ నుంచి మేడిగూడ(సి) గ్రామానికి వస్తుండగా కాల్వలో పడి మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి కొడుకు గంగన్న ఫిర్యాదుమేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

'ఎంపీ చొరవతో గ్రామాల్లో సిమెంటు రోడ్లు'

బోథ్, ఫిబ్రవరి 21: జిల్లాలో ఎంపీ సోయం బాపురావ్ చొరవ వల్ల సీసీ రోడ్ల నిర్మాణం పూర్తివతున్నాయని, ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన జిల్లా అధ్యక్షుడు జి.రాజుయాదవ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కౌటా(బి) గ్రామంలో గ్రామ ఎంపీటీసీ పిడుగు శిరీష అశోక్ రెడ్డితో కలిసి సిసి రోడ్లను ప్రారంభించి మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎంపీ ఇచ్చిన మాట ప్రకారం గ్రామానికి నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, వీడీసీ అధ్యక్షులు గాజుల సురేందర్ రమణారెడ్డి పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న విశ్వకర్మ యోజన జిల్లా అధ్యక్షుడు